

# మేము ఊహించని అద్భుతం

'నా కెరీర్‌లోనే అత్యంత ఆనందకరమైన క్షణాలివి. కష్టపడి పనిచేస్తే తప్పకుండా ఫలితం ఉంటుందనే నా నమ్మకాన్ని ఈ విజయం రుజువు చేసింది' అన్నారు అగ్ర నటుడు వెంకటేష్. ఆయన కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి విజయపథంలో పయనిస్తున్నది. ఈ సందర్భంగా శుక్రవారం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ స్క్రిప్ట్ విన్నప్పుడే ఉత్సాహం కలిగిందని, ప్రేక్షకులు సూపర్ డూపర్ హిట్ చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'నిర్మాతగా హిట్స్, ఫ్లాప్స్, బ్లాక్‌బస్టర్స్ అన్నీ చూశాను. అందులో కొన్ని సినిమాల విజయాలు ఏదో తెలియని కిక్‌నిచ్చాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' మేము ఊహించని గొప్ప అద్భుతం. ఇది మాకు బ్లాక్‌బస్టర్ పొంగల్. ఈ సినిమాకు మొదటి నుంచి పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. కొత్త ఆలోచనలతో సినిమాను ప్రమోట్ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో దర్శకుడు అనిల్ రావిపూడి నిరూపించారు' అన్నారు. ఈ సినిమా మా సమస్యలన్నింటిని తీరుస్తుందని దర్శకుడు అనిల్ రావిపూడి షూటింగ్ సందర్భంలో పదే పదే చెప్పేవారని, ఈ రోజు విజయంతో ఆయన మాటలు నిజమయ్యాయని నిర్మాత శిరీష్ ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'దిల్‌రాజు, శిరీష్ నన్ను దర్శకుడిగా నిలబెట్టిన నిర్మాతలు. ఈ సంస్థను నా హోమ్ బ్యానర్‌గా ఫీలవుతా. వారితో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. వెంకటేష్‌గారికి ఓ అభిమానిలా ఈ సినిమా తీశా. మా ఇద్దరి కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ హిట్. దర్శకుడిగా ఎనిమిది సినిమాల ప్రయాణం నాది. అందులో చివరి ఐదు చిత్రాలు వందకోట్ల వసూళ్ల మైలురాయిని దాటాయి. ప్రేక్షకులు థియేటర్లో విజిల్స్ కొట్టే సినిమా చేయడం నాకు ఇష్టం. అలాంటి సినిమాలే చేస్తాను' అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయిక ఐశ్వర్యరాజేష్, అవసరాల శ్రీనివాస్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# నా రికార్డులన్నీ అన్‌స్టాపబుల్!



'నా కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. గత కొన్నేళ్లుగా వరుసగా నాలుగు విజయాలను సాధించడం ఆనందంగా ఉంది. ప్రతీ సినిమాను ఓ ఛాలెంజ్‌గా భావించి చేశాను. నీటి సమస్యను చర్చిస్తూ గొప్ప సామాజిక సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించే ఇలాంటి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు అగ్ర నటుడు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శుక్రవారం విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ' దర్శకుడు బాబీ ఈ సినిమా ద్వారా నా నట విశ్వరూపాన్ని రాబట్టుకున్నాడు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు. రైటర్స్, టెక్నీషియన్స్ అందరూ శ్రమించి ఈ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌కు ఇప్పటి నుంచి 'ఎన్‌బీకే తమన్' అని నామకరణం చేస్తున్నా. అంత గొప్పగా మ్యూజిక్ ఇచ్చాడు. అన్ని విభాగాల మీద పట్టున్న నాగవంశీ వంటి నిర్మాత దొరకడం అదృష్టం. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన చిత్రాలు తీయాలని కోరుకుంటున్నా. నా రికార్డులు, కలెక్షన్స్, అవార్డులు, రివార్డులన్నీ అన్‌స్టాపబుల్' అన్నారు. చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమాలో బాలకృష్ణను కొత్తగా చూపించాలని ముందే అనుకున్నాం. ఆ ప్రయత్నంలో విజయం సాధించాం. నెట్‌ఫ్లిక్స్ వాళ్లు ఈ మధ్య మమ్మల్ని కలిసినప్పుడు ఇదొక క్లాస్‌మాస్ ఫిల్మ్ అని ప్రశంసించారు. డిస్ట్రిబ్యూటర్స్ సేఫ్ అయితే అదే మాకు పెద్ద సక్సెస్. ఈ సినిమా విషయంలో డిస్ట్రిబ్యూటర్స్ చాలా హ్యాపీగా ఉన్నారు' అన్నారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ 'బాలకృష్ణగారికి బెస్ట్ ఫిల్మ్ ఇవ్వాలనుకున్నా. ఆయన కెరీర్‌లో మాస్టర్‌పీస్ తీశానని చాలా మంది చెప్పడం గొప్ప అచీవ్‌మెంట్‌గా భావిస్తున్నా' అన్నారు.

# వీరమల్లు మాట వినాలి..



17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో, అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ చారిత్రక యోధుడి పాత్రలో నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా మొదలయ్యాయి. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. శుక్రవారం 'మాట వినాలి..' అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ స్వయంగా ఆలపించారు. కీరవాణి స్వరాల్ని అందించిన ఈ గీతాన్ని పెంచల్‌దాస్ రచించారు. 'వినాలి..వీరమల్లు మాట చెప్తే వినాలి' అంటూ తెలంగాణ మాండలికంలో మొదలైన ఈ పాట జానపద శైలిలో సాగుతూ ఆకట్టుకుంది. జీవితంలో ఆశావహ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, ధర్మాన్ని పాటించాలనే సందేశంతో ఈ పాట శ్రోతల్ని మెప్పించేలా ఉంది. అటవీ నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఆర్ట్: తోట తరణి, సమర్పణ: ఏ.ఎం.రత్నం, నిర్మాత: దయాకర్ రావు, దర్శకత్వం: క్రిష్, జ్యోతికృష్ణ.

# సోనూ లైలాగా మారితే..



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'లైలా' టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సాహు గారపాటి నిర్మాత. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ బ్యూటీపార్లర్ నడిపించే మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు. బ్యూటీపార్లర్‌లో మహిళలను ఆకర్షించే సోనూ పాత్రతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మోడల్ సోనుతో మహిళలు చనువుగా ఉండటంతో మగాళ్లందరూ ఆయనపై అసూయ పెంచుకుంటారు. ఈ నేపథ్యంలో సోనూ అనూహ్యంగా అమ్మాయి లైలాగా అవతారాన్ని ఎత్తాల్సివస్తుంది. ఈ రెండు పాత్రల్లో విశ్వక్‌సేన్ చక్కటి వేరియేషన్ కనబరచినట్లు టీజర్ చూస్తే అర్థమవుతున్నది. రొమాన్స్, యాక్షన్, కామెడీ అంశాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, రచన: వాసుదేవ మూర్తి, దర్శకత్వం: రామ్ నారాయణ్.

# ఎన్టీఆర్ నామస్మరణే మహాద్భాగ్యం



'ఎన్టీఆర్ యుగపురుషుడు. కారణజన్ముడు. అలాంటి వారు ఓ మహత్తర కార్యం కోసం దివి నుంచి భువికి వస్తారు. జీవితాన్ని సాఫల్యం చేసుకొని, కోట్ల మందికి ఆదర్శప్రాయులై మరలా దివికేగుతారు. నేడు ఎన్టీఆర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన చూపించిన మార్గం సదా అనుసరణీయం. తెలుగు భాష, జాతి ఉన్నంత కాలం ఆయన చిరస్మరణీయుడిగా నిలిచిపోతారు' అన్నారు ప్రముఖ దర్శకుడు వై.వి.యస్. చౌదరి. నేడు విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి. ఈ సందర్భంగా వై.వి.యస్.చౌదరి మాట్లాడుతూ 'ఎన్టీఆర్ కేవలం నటుడిగానే కాదు, దర్శకుడిగా, రాజకీయ వేత్తగా కోట్ల మందిలో స్ఫూర్తినింపారు. తెలుగు నేలపై రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చి ప్రజల జీవితాల్లో వెలుగుల్ని నింపారు. ఎందరికో రాజకీయ జీవితాన్ని ప్రసాదించారు. పురాణ పాత్రలకు వెండితెరపై సజీవరూపంలా నిలిచి భారతీయ హైందవ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటారు. సాధారణ కార్మికుల నుంచి సైంటిస్టుల వరకు ఆయన అందరికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. నటుడిగా, రాజకీయవేత్తగా, తెలుగు భాష, విలువల పరిరక్షకుడిగా తెలుగు జాతికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఓ వ్యక్తి తన జీవితకాలంలో ఇన్ని కార్యాల్లో సాఫల్యత సాధించడం అరుదైన విషయం. అది కారణజన్ములకే సాధ్యం. అలాంటి మహాపురుషుడి వర్ధంతి రోజున ఆయన పేరుని స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతంలా, మహాద్భాగ్యంగా భావిస్తున్నా' అన్నారు.








